
ది గర్ల్ విత్ స్మోకింగ్ లుక్స్
కె. రామచంద్రరావు

క్రాఫీ తీసుకోండి' అంది శారద.

'అక్కడ పెట్టి వెళ్ళు'

'తీసుకోండి. చల్లారి పోతుంది. తరవాత రాసుకోవచ్చు. మీకు రాతలో పడితే ఒళ్ళు తెలియదు'

సత్యమూర్తి మాట్లాడలేదు. అతనికా రోజు చాలా చిరాగ్గా ఉంది. కారణం తెలియదు.

కాసేపుండి సిగరెట్టు వెలిగించాడు. రెండు రింగులు వదిలాడు. శారద రింగులకేసి చిత్రంగా చూసింది. ఎప్పుడూ అలాగే చూస్తుంది. ఆమెకి అవి చాలా వింతగా ఉంటాయి.

తన చూపులు బల్లమీదికి తిప్పుకుని 'ఏమిటి రాస్తున్నారు ?' అంది.

'ఒక కథకి థీమ్ తట్టింది. ఆ సంఘటనలు అల్లడం కోసం చూస్తున్నాను ?'

'అయితే మీరు కాఫీ తప్పకుండా తాగాలి. బ్రెయిన్ వేవ్స్ వస్తాయి' అందామె.

సత్యమూర్తి ఆమె కళ్ళల్లోకి చూశాడు. చదువుకున్నదీ, అనుకూలవతీ అయిన భార్య, అందమైనది కూడా. తనని ప్రాణంలా చూసుకుంటుంది. కానీ. . . . తనల్లా చూడలేదు ఆమెని. తను హృదయం ఇవ్వలేదు. ఇవ్వడానికి తన దగ్గర లేదది. తన దగ్గరున్నది రాధ హృదయం. తన హృదయం రాధ దగ్గరుంది.

రాధ గుర్తుకువస్తే మనస్సు ఉరకలు వేస్తోంది. శరీరం ఒక చోట నిలవటం లేదు. లేచి డాన్స్ చెయ్యాలనిపిస్తోంది. రాధతో కలిసి ఆకాశంలోకి ఎగిరి పోవాలనిపిస్తోంది.

కాఫీ కప్పు అందుకున్నాడు. అందులో రాధ కనిపించింది. ఆత్రంగా నోట్లో పోసుకోబోయాడు కాఫీని.

'ఏమిటా తొందర— నోరు కాల్తుంది' అంది శారద. సత్యమూర్తి ఒక్కసారిగా చప్పబడి పోయాడు. మధుర స్వప్నం ఒక్కసారిగా కరిగి పోయినట్లనిపించింది.

'నెమ్మదిగానే తాగుతాలే. నువ్వెళ్ళు.' అన్నాడు విసుగ్గా.

'కప్పు కడగాలి.'

అతను తొందరగా తాగి కప్పు ఇచ్చేశాడు. ఆమె వెళ్ళి పోయింది.

అతను వెంటనే పర్సు తీసి, లోపల నుంచి ఒక ఫోటో తీశాడు. అందులో ఒక పద్దెనిమిదేళ్ళ అమ్మాయి బొమ్మ ఉంది అపురూప సౌందర్యవతి ఆమె. చక్రాల్లాంటి కళ్ళు, చందమామ లాంటి ముఖం, తీర్చి దిద్దినట్లున్న కనుబొమలు, ముద్దొచ్చే చిన్ని నోరు, మెరుపు తీగలాంటి శరీరం.

రాధ ఇప్పుడు ఏం చేస్తోందో అనుకున్నాడు.

సమాధానం వెంటనే తోచింది. తను ఆమె ఫోటోని చూస్తున్నట్లే బహుశా ఆమె కూడా తన ఫోటోని తదేక దీక్షగా చూస్తూ ఉంటుంది. భర్త వస్తే చటుక్కున దాచేస్తుంది. ఏమిటని అడుగుతాడు— ఏం లేదని ఏదో సర్ది చెబుతుంది. ఆడవాళ్ళు అబద్ధమాడితే గోడకట్టినట్లు ఉంటుంది.

తనకలా అబద్ధం చెప్పవలసిన అవసరంలేదు. భార్య చూసినా తను భయపడడు. అంతగా అడిగితే 'నాతో కాలేజీలో చదువుకుంది. నా కథ అంటే ఇష్టం ఆ అమ్మాయికి' అని చెబుతాడు. ఇంక అడగదు. అర్థం చేసుకుంటుంది. అయినా పెళ్ళయేదాకా మగాడు ఏ ఆడదానితోటీ మాట్లాడకుండా మడిగట్టుకొని కూర్చుంటాడని అనుకుంటుందా ?

అయినా తను అంతవరకూ రానివ్వడు. అసలు ఫోటో ఆమె కంట ఎందుకు పడాలి ?

మళ్ళీ ఆ ఫోటోకేసి చూశాడు. ఆ కళ్ళు చిత్రంగా ఉంటాయి— పలకరిస్తున్నట్లుగా, నవ్వుతున్నట్లుగా.

'ది గర్ల్ విత్ స్పేరింగ్ లుక్స్' అనే వారు ఆ అమ్మాయిని తన కాలేజీలో.

తన కథ పడినప్పుడు తనకి కంగ్రాచ్యులేషన్స్ చెప్పింది చాలా బావుందనీ, ఇంకా చాలా రాయమనీ అంది.

ఆ రోజు డైరీలో నోట్ చేసుకున్నాడు.

పాత డైరీకేసి ఆ పేజీ తిప్పాడు.

'ఇవాళ రాధతో మొదటిసారిగా మాట్లాడాను. నా కథ పడినందుకు కంగ్రాచ్యులేషన్స్ చెప్పింది. కథ తనకి చాలా నచ్చినట్లు చెప్పింది. క్లాసులో రెండుసార్లు నాకేసి చూసి నవ్వింది. ఎందుకో చాలా సరదాగా ఉంది. చల్లటి గాలి వీస్తున్నట్లు అనిపిస్తోంది. ఇలాంటి అనుభవం ఇంతకు ముందు లేదు !'

అలాగే పేజీలు తిప్పుతూ చదువుతున్నాడు.

'ఇవాళ రాధతో కలిసి బీచికి వెళ్ళాను. సముద్ర తీరాన రాధతో సరదాగా గడిచింది. సినిమాకి వెడదామని ప్రపోజ్ చేశాను. తరువాత ఎప్పుడైనా వస్తానంది.

రూముకి వచ్చాక సుబ్బారావు షేక్ హాండు ఇచ్చాడు. దేనికని అడిగితే 'ఆ అమ్మాయి'తో బీచికి వెళ్ళినందుకుట. వాడికదే గొప్పగా ఉంది. ఆ అమ్మాయితో సింహాచలం వెళ్ళినట్లు వాడికి తెలీదు.'

'కథ రాద్దామనుకుంటుంటే మూడ్ కుదరటం లేదు. రాధ మీదికి మనసు పోతోంది. 'నా ప్రేమ రాధమీదే కథ రాస్తే' అని ఆలోచన వచ్చింది. వెంటనే ఆ వూహని దూరం చేశాను. రాధ నాదిగానే ఉండి పోవాలి. నలుగురికీ తెలియ కూడదు. ఆమె అందం నా ఒక్కడిదే కావాలి ?

'నాలో ఏం చూసి నన్ను ఇంత....' అని ఆగి పోయాను.

'ఇంత .... ?' అని ప్రశ్నించింది. ఏమనాలో నాకు తోచలేదు. ఏం చూసి ఇంత ప్రేమిస్తున్నావు ? అనాలని నా ఉద్దేశం. నన్ను నిజంగా ప్రేమిస్తోందా ? ప్రేమించక పోతే నాతో ఎందుకంత చనువుగా ఉంటుంది ? నేనంటే నీ కెందుకింత ఇష్టం ? అని అడిగాను. అర్థం కానట్లు చూసింది. ఆడవాళ్ళు ఒక పట్టాన తేలరు.' నాలో ఏముందని నన్నింత లైక్ చేస్తున్నావని అడిగాను. 'మిమ్మల్ని చూసి' అంది. చాలా మాటకారి."

'నాన్నగారు పెద్ద ఆఫీసరని మొదటిసారిగా తెలిపింది. అందంతో పాటు డబ్బు కూడా ఉందన్న మాట. చదువుకూడా ఉంటే చాలా బాగుండును. ఇప్పటిదాకా ఏమీ చదువుతున్నట్లు లేదు. మొన్నటి పరీక్షల్లో మార్కులు బాగా రాలేదు. అసలు చదివినా అర్థం కాదుట. ఈ ఏటితో మానేస్తుందట.'

" 'నిన్ను చూడందే ఒక్క క్షణం ఉండలేను' అన్నాను 'నేనూ అంతే అంది' నవ్వుతూ"

"ఇవాళ తన ఫోటో నాకిచ్చింది. నా ఫోటో ఒకటి ఇమ్మంది. మూడు రకాల ఫోటోలు తీయించుకుని బాగా వచ్చినది ఇచ్చాను. ఆమె ఫోటో డైరీలోనే పెట్టాను. రాధ నా డైరీలోనూ నా హృదయంలోనూ, నా ఇంట్లోనూ శాశ్వతంగా ఉండాలి."

అలా డైరీ తిరగేస్తూ ఒక చోట ఆగి పోయాడు. ఆ పేజీ తనకి గుర్తు. ఆ పేజీకి ముందు 15 పేజీలు కాళీగా ఉంటాయి. ఆ పేజీ తిప్పిన తర్వాత మరో పేజీ వస్తుంది. దాంట్లో......

సత్యమూర్తి డైరీ టేబులు మీద పడేశాడు. వంట్లో నీరసం వచ్చేసింది. కొద్దిగా తలకాయ నొప్పి వచ్చింది. తల చేత్తో పట్టుకున్నాడు.

కిటికీలోంచి వచ్చిన గాలికి డైరీలో పేజీ తిరిగింది. అది డిసెంబరు 30వ తేదీ పేజీ.

'ఈ రోజు రాధ పెళ్ళి' అని ఉంది అందులో.

డైరీ మూసేసి లోపల పెట్టేసి బయటికి వెళ్ళి పోయాడు సత్యమూర్తి.

*　　*　　*

ఎక్కడికి వెళ్ళాలనే ప్రశ్న ఇంటి దగ్గర రాదు. హోటలు దగ్గర వస్తుంది.

సత్యమూర్తికి హోటలు దగ్గర కూడా రాలేదు. హోటల్లో రవి కనిపించాడు. రవి అతనితో హైస్కూల్లో చదివాడు. కాలేజీ చదువు విజయనగరం కాలేజీలో చదివాడు. ఇంకా ఉద్యోగం లేదు. ప్రస్తుతం ఉద్యోగానికి ఇంటర్వ్యూకి వెడుతున్నాడు. రెండింటికి బస్సులో వచ్చాడు. సాయంత్రం అయిదున్నరకి బండి.

స్నేహితులిద్దరూ చాలా సేపు కబుర్లు చెప్పుకుంటూ వూరంతా తిరిగేశారు. వసంతమహాల్లో టిఫిన్ తీసుకుని కాసేపు డైమండ్ పార్కులో కూర్చుని రైలుకి బయలు దేరాడు. రైలు పోబోతుండగా చెప్పాడు రవి.

'అన్నట్టు ఆ అమ్మాయి.... స్పేరింగ్ లుక్స్.... ఎక్కడుందో తెలుసా ?'

'తెలీదు. నీకు తెలుసా ?'

'నాకు విశాఖపట్టణంలో కనపడింది'

'నీతో మాట్లాడిందా ? నా గురించేమైనా అడిగిందా ? ఎడ్రసేమిటి ?' అడిగాడు సత్యమూర్తి ఆత్రుతగా.

రైలు కూత వేసింది.

'ఇదిగో సరిగ్గా ఇలాగే కలుసుకున్నాం. సరిగ్గా రైలు బయలు దేరడానికి రెండు నిమిషాలుండనగా ఆమెని గుర్తు పట్టాను స్టేషన్లో. పక్కన భర్త ఉన్నాడు. ముందు పలకరిద్దామా వద్దా అని సందేహించాను. గార్డు పచ్చజెండా వూపేసరికి ధైర్యం వచ్చి పలకరించాను. ఏమీ మాట్లాడటానికి వీలులేక పోయింది. భర్తని ఇంట్రడ్యూస్ చేస్తోంటే రైలు కదిలింది. ఆదరా బాదరాగా ఎడ్రసు రాసిచ్చింది. నా నోట్‌బుక్‌లో. ఇదిగో' అని కాగితం చించి ఇచ్చాడు రవి.

రైలు కదిలి వెళ్ళిపోతుంది. దూరం నించి

# ది గర్ల్ విత్ స్ప్రింగ్

చెయ్యి వూపాడు రవి. మూర్తి కూడా చెయ్యి వూపాడు.

*　　*　　*

రోజులు బరువుగా గడుస్తున్నాయి. సత్యమూర్తికి రాధ ఎక్కడుందో తెలిసింది. కాని వెళ్ళలేక పోతున్నాడు. రెండు వందల మైళ్ల దూరం. వెళ్లి రావాలంటే కనీసం మూడు రోజులు సెలవు కావాలి. తనకి సెలవు దొరకదు. అయినా ఏం పని మీద వెడతాడు ? వివాహితురాలైన స్నేహితురాల్ని చూడటానికి రెండు వందలమైళ్ల దూరం వెడతాడా ?

శారదకి భర్త ప్రవర్తన అంతు పట్టటం లేదు. తనకేసి చూస్తుంటే అతని మనస్సు ఎటో పోతున్నట్లు ఆమె గ్రహించింది. కారణం తెలియదు. ఈ మధ్య ఆయన అదోరకంగా ఉంటున్నారు. చేద్దామనుకున్న పనిని చేయలేక పోతున్నట్లు పొందవలసిన దాన్ని పొందలేక పోతున్నట్లూ, ఉంటుంది ఆయన ముఖం చూస్తే. తనని గురించి ఆసక్తి చూపించడు— తన పట్ల సుముఖత లేక పోయినా 'ఇంటరెస్టు' లేదు. అప్పుడప్పుడు చిరాకు పడుతుంటాడు.

ఆయన్ని ఇంకెవరైనా ఆకర్షించారా? అన్న అనుమానం ఆమెకు కలగక పోలేదు. అతని డైరీ చూద్దామని ఆమెకి అప్పుడప్పుడు అనిపించేది కూడా. కాని సభ్యత అడ్డు వస్తోంది. కాని ఆయన మనస్సులోని చింత తెలుసుకోవాలంటే చూడక తప్పదు. కేవలం తమ సంసార సౌఖ్యం కోసం అతన్ని సుఖ పెట్టడం కోసం చూడక తప్పదు.

అతన్ని సుఖ పెట్టడమే ఆమె ధ్యేయం.

ఏదో అనుమానం వచ్చినట్లు ఆమె అద్దంలో చూసుకుంది.

అద్దంలో కనిపించిన బొమ్మ అందమైనది నిండైన విగ్రహం. మగవాళ్ళని వెర్రెత్తించే అందంకాదు ఆ బొమ్మది. ఆమెను చూస్తే గౌరవం, ప్రేమ, వాత్సల్యం కలుగుతాయి. అమాయకత, వివేకం, నైర్మల్యం, ప్రశాంతత ఆమె ముఖంలో కనిపిస్తాయి.

తనంటే భర్తకి ఇష్టంలేక పోవడానికి కారణం ఆమెకి కనిపించలేదు. భర్త చికాకుకి కారణం తనంటే విముఖత అయివుండదు. మరేదో ఉండి ఉండాలి. డైరీ చూడాలి.

శారద డ్రాయింగు రూములోని టేబులు దగ్గరకి వెళ్లింది. డైరీ లాంటి దేదో టేబులు లోపల ఉంది. దాన్ని చేతుల్లోకి తీసుకుంది.

'పోస్ట్' అని వినిపించింది. గబుక్కున అది టేబులు లోపల పడేసి బయటికి పరిగెత్తింది.

పోస్టుమేన్ కోసం చిన్నా, పెద్దా, ఆడా, మగా అంతా నిరీక్షిస్తారు. అతనిరాక ఎందుకో ఆనందంగా ఉంటుంది.

పోస్టుమేన్ పక్కింట్లో ఉత్తరం ఇస్తున్నాడు.

'మాకేమన్నా ఉన్నాయా' అని అడిగింది. 'ఏమీ లేవమ్మా' అనేసి ముందుకు వెళ్లి మళ్లీ వెనక్కి తిరిగి 'మీరు సత్యమూర్తిగారు కదూ. ఉన్నాయి. బుక్‌పోస్ట్, ఉత్తరం' అన్నాడు. 'నేను సత్యమూర్తి గారిని కాను' అంది నవ్వుతూ చెయ్యి జాపి. ఆ కవర్లు ఇస్తూ పోస్టుమాన్ కూడా నవ్వాడు.

ఉత్తరం బావగారు రాసినది.

బుక్ పోస్టులో వచ్చింది శుభ లేఖ.

*　　*　　*

'ఇవాళ మీకు వంట్లో బాగా లేనట్టుంది. నీరసంగా ఉన్నారు. కాస్త హార్లిక్స్ తీసుకోండి' అంది శారద.

'కాదు. కాఫీ ఇయ్యి' అన్నాడు సత్యమూర్తి.

'హార్లిక్స్ తాగండి. నీరసం తగ్గుతుంది.'

'నాకు నీరసం లేదు. కాఫీ ఇస్తావా ? ఇవ్వవా ?' అతని బెదిరింపులని ఆమె లెక్కపెట్టలేదు.

'మీకు కాఫీ కావాలా ? హార్లిక్సా, మీకొచ్చిన ఉత్తరం కావాలా ?'

గబుక్కున మంచం మీద లేచి కూర్చున్నాడు.

'ఏదీ ఉత్తరం ?'

'హార్లిక్స్ తీసుకోండి.'

తెగించి హార్లిక్స్ తాగేశాడు సత్యమూర్తి.

'ఇప్పుడియ్యి' అన్నాడు

'ఏమిటి ఇచ్చేది ?'

'ఉత్తరం వచ్చిందని చెప్పలేదూ నువ్వు ?'

'అలా చెప్పకపోతే మీరు హార్లిక్స్ తాగే వారా?' అందామె.

---

రాము : ఏరా! మూర్తీ! ఆ హోటల్‌లో భోజనం బాగుండదంటూ అక్కడే భోంచేస్తున్నావేం !

మూర్తి: భోజనం బాగుండక పోయినా అప్పు పెడ్తాడు గదా ! మరో చోటైతే ఈ సౌకర్యం ఉండదు బ్రదర్ !

ఎం. మాధవ్‌రావు (తెనాలి)

---

నీరసంగా మంచం మీద వాలాడు అతను.

'పోనీ సిగరెట్టు, అగ్గిపెట్టె తీసుకురా' అన్నాడు.

'బల్లమీదే ఉన్నాయి. తీసుకోండి !'

వాటికోసం వెతుకుతుంటే రెండు కాయితాలు కూడా చేతికి తగిలాయి. తీసిచూస్తే ఉత్తరాలు. అతని ముఖం వికసించింది 'మరి రాలేదని చెప్పావేం ?' అన్నాడు.

శారద నవ్వింది.

తర్వాత ఆశ్చర్యపడటం ఆమె వంతైంది. తమ్ముడికి ఉద్యోగం అయినట్లుగా బావగారు రాసిన ఉత్తరం మామూలుగా చదివాడు అతను. ఎవరో దూరపు బంధువుల పెళ్లి శుభలేఖ ఆశక్తితో చూశాడు. పిల్ల తండ్రి ఆయన వేలువిడిచిన మేనమామకి ఏదో అవుతాడు. పెళ్లి కూతురు అన్నకీ, ఆయనకీ కొద్దిగా పరిచయం.

శుభలేక చూశాక అతని ఉత్సాహానికి పట్టపగ్గాలు లేకుండా పోయింది. కారణం ఆమెకి బోధ పడలేదు. శుభలేఖ మళ్లీ చదివింది. '..గారి కనిష్ట పుత్రికి. చి. సౌ. మహాలక్ష్మిని. . . .గారి ద్వితీయ పుత్రుడు బి. భాస్కరరావునకు ఇచ్చి మా స్వగృహమైన విశాఖపట్టణం డాబా గార్డెన్స్ లోని వెం. . . ఇంటిలో వివాహము జరిపించుటకు పెద్దలు నిశ్చయించిరి గావున. . . .' ఇలాగే ఉంది శుభలేఖ. ప్రత్యేకత ఏమీలేదు.

*　　*　　*

కలకత్తా మెయిల్ ఎక్కాడు సత్యమూర్తి రైలు వేగంగా పరిగెడుతోంది. అంతకంటె వేగంగా పరిగెడుతోంది అతని మనస్సు. డాబా గార్డెన్స్‌లో ఒక ఇంట్లో ఒక ఫోటోకేసి దీక్షగా చూసి నిట్టూరుస్తున్న ఒక అమ్మాయి అతని దృష్టిలో మెదులుతోంది. ఆ అమ్మాయి ఆ ఫోటోని ముద్దు పెట్టుకుంటోంది. అతనితో పాటు ఏదో లోకంలో విహరిస్తున్నట్లు కలలు కంటోంది. మనస్సు పాటలు పాడుతోంది. చక్కని కాటుక కళ్ళు, ఒంటి ఒంపులు ఆమెవి.

సిగరెట్లూ, పత్రికలూ అమ్మేవాళ్ల కేకలు, జనం సందడీ వినిపించగానే 'తుని స్టేషన్ గాబోలు' అనుకున్నాడు. కాదు. అది తాడేపల్లి గూడెం. అతను నవ్వుకున్నాడు.

చటుక్కున అతనికి డిశంబరు 14వ తేదీ గుర్తుకి వచ్చింది. ఒక్కసారిగా నీరసపడి పోయాడు.

అతనికి ఎప్పుడూ అంతే. సంతోషం అనుభవించేటప్పుడు హఠాత్తుగా విచారకరమైన విషయాలు గుర్తుకు వస్తుంటాయి.

ఆ రోజు....

'నీ కెలా చెప్పాలో తెలియటం లేదు' అంది రాధ.

'మామూలుగా నోటితో భాష ద్వారా చెప్పు'

'హాస్యం కాదు. సీరియస్‌గానే చెబుతున్నాను'

'చెప్పు.'

'మనం విడి పోబోతున్నాం' అంది.

మొదట్లో తనకి అర్థం కాలేదు.

'ఏమిటి' అన్నాడు.

'మా నాన్న నాకు సంబంధం చూశారు' అంది. ఆమె ముఖంలో ఏ భావం లేదు. ప్రశాంతంగా ఉంది. విచార పడటంలేదు. సంతోషపడటంలేదు.

'నా కిష్టం లేదని చెప్పు' అన్నాడు తను.

ఆమె ఆశ్చర్యంగా చూసింది. 'ఎందుకు ?' అంది.

'మనిద్దరం పెళ్లి చేసుకుందాం'

ఆమె తల విదిలించింది 'ఆ మాట ముందు మనం అనుకోలేదుగా'

'ఇప్పుడనుకుందాం'

'లాభం లేదు. మా నాన్న ఒప్పుకోరు'

'నేను అడగనా ?'

'శ్రమ పడకు. మా నాన్న సంగతి నీకు తెలీదు. ఒకటి నిశ్చయించాక ఇక దానికి తిరుగు ఉండదు.'

ఆ రోజు సంభాషణ అంతటితో ఆగి పోయింది.

'రాధ ఉద్దేశం అర్థం కావటం లేదు' అని మాత్రం రాసుకున్నాడు డైరీలో ఆ రోజు. తర్వాత మళ్లీ రాయలేదు. మళ్లీ డిశంబరు 30వ ఒక ముక్క రాశాడు.

తర్వాత రాధ గురించి కొన్నాళ్ళు ఆలోచించ లేదు. కాలక్రమాన సర్ది చెప్పుకున్నాడు. వివాహం నిశ్చయించినప్పుడు రాధకి తండ్రికి ఎదురు చెప్పే ధైర్యం ఉండి ఉండదు. ఆడవాళ్లెప్పుడూ అంతే— తమ చేతిలో ఉన్న విషయాలను విధికి వదలివేస్తారు. తన మనసువిప్పి చెప్పి ఉంటే

39 వ పేజీ చూడండి

ఆ ప్రకారమే చేసేవారు వాళ్ల నాన్నగారు. తండ్రి తన మనసు కనుక్కుని, తను ప్రేమించిన వాడిని బతిమాలి, అతడి కోరికలు తీర్చి, అల్లుడుగా తెచ్చుకుంటాడని అనుకుందా ?

ఆ ఆలోచన రాగానే అతనికి మళ్లీ ఉత్సాహం వచ్చింది. అవును. మనసు తన మీద, పెళ్లి ఇంకొకరితో. పాపం ఏం అవస్థ పడుతోందో ? మనో సంఘర్షణ భరించడం కష్టం.

తన మీద ఆమెకి ఎనలేని ప్రేమ. తనతో ఎంత చనువుగా ఉండేది !

హఠాత్తుగా అతనికి ఆమె భర్త గుర్తుకు వచ్చాడు. 'పూర్ ఫెలో' అనుకున్నాడు. భార్య మనస్సు అన్యథా ఉందని అతనికి తెలిసి ఉంటుందా ?

ఆ తర్వాత అతడి వూహ మరికొంత దూరం పోయింది.

ఇప్పుడామె తన కథలు పిచ్చి వ్యామోహంతో చదువుతూ ఉంటుంది. పుస్తకాల బీరువాలో ఒక అర తన నవలల కోసం ప్రత్యేకించి ఉంచుతుంది. దీపావళి కథల పోటీలో తనకి మొదటి బహుమతి వచ్చినందుకు అభినందిస్తుంది. ఈ మధ్య తను రాసిన కథలన్నిటి గురించి ఒక్క సారి అభిప్రాయం ఇవ్వలేక 'అన్నీ బాగున్నాయి' అంటుంది. తన కథలంటే ఆమెకెంతో ఇష్టం. సత్యమూర్తి ఉక్కిరి బిక్కిరయి పోయాడు.

స్టేషను వచ్చేసరికి పెట్టె పుచ్చుకుని దిగబోయాడు. 'మీరు సామర్లకోటలో దిగాలని చెప్పారు గదా.' అన్నాడు ప్రక్కతను. అర్థం కానట్లు చూశాడు సత్యమూర్తి. 'ఇది సామర్లకోట' అన్నాడు ఆయన. గడియారం, చూసిన తర్వాత కాని నమ్మలేదు సత్యమూర్తి.

తర్వాత కొన్ని సంవత్సరాలకి విశాఖపట్నం చేరుకుంది బండి. బండి దిగటం భోజనం చెయ్యటం, పెళ్లి వారింటికి వెళ్లటం, స్నానం చేసి కొద్దిగా టిఫిన్ చెయ్యటం ఇవన్నీ రాధ గురించి ఆలోచించకుండా గబగబా చేశాడు. వెంటనే బయలుదేరాడు.

*　　　*　　　*

మూసి ఉన్న తలుపు దగ్గరకి వచ్చాక అతనికి సందేహం పట్టుకుంది. రాధని పిలవాలా, ఆమె భర్త పేరు పిలవాలా ? జేబులోంచి కాగితం తీసి చూశాడు. 'మోహనరావు' అని ఉంది మోహనరావుగారూ అని పిలవటానికి సగ్గేసింది. అతనెవరో తనకి పరిచయం లేదు. ఇంటి గృహిణి తనకి తెలుసు. ఎలా పిలవాలి ?

కాసేపు ఆలోచించి అతను తలుపు తట్టాడు ఎవరూ పలకలేదు. రెండవసారి తలుపు తట్టినప్పుడు 'ఎవరూ ?' అని వినపడింది. కాని తలుపులు తెరుచుకోలేదు. సత్యమూర్తి మళ్లీ తలుపు తట్టాడు. ఈ మాటు కూడా 'ఎవరూ' అని వినపడింది. కొంచెం సేపయ్యాక తలుపు తెరుచుకుంది. ఒక చిన్న పిల్ల గుమ్మంలో నుంచుని 'నాన్నగారు లేరు' అంది.

సత్యమూర్తికి అప్పటికే సిగ్గుతో చచ్చిపోతున్నట్లు అనిపించింది. 'మీ అమ్మ గారు లేరా' అని అడిగాడు.

'అమ్మా నువ్వు కావాలిట' అంటూ లోపలికి పరిగెత్తింది ఆ అమ్మాయి. అతనికి తల తీసేసినట్టయింది.

# ది గ్లర్ విత్ స్నేరింగ్

24 వ పేజీ తరువాయి

ఇంతలో ఒకామె వచ్చింది అక్కడికి. 'ఆయన లేరు' అని లోపలికి పోబోయి ఆగింది. సత్యమూర్తి కూడా పరీక్షగా చూశాడు ఆమెని. సందేహంలేదు ఆమె రాధ.

.... కాని చాలా మారిపోయింది. నిండు చీర, ఒంటి నిండా కప్పుకుంది. ఒక్క జడ వేసుకుంది. మామూలు బొట్టు పెట్టుకుంది. చెవలకిదుద్దులూ కాళ్లకి మట్టెలూ, మెళ్లో మంగళ సూత్రం, నల్ల పూసలూ, ఆ కళ్లు మారలేదు గాని వాటిలో చిలిపితనమూ, పలకరింపూ లేవు. ఒంటిలో ఎక్కువ సత్తువ ఉన్నట్లు లేదు. తానెరిగిన రాధ కాదు ఈ రాధమ్మ.

'మీరు....' అని నీళ్లు నమిలి 'రాధగారు కదూ' అన్నాడు.

'సత్యమూర్తిగారు' అంది ఆమె ఆశ్చర్యంగా. ఆ సంబోధనలు అతనికే ఆశ్చర్యం కలిగించాయి. 'మూర్తీ' అని ఆమె. 'రాధా' అని తనూ పిలుచుకునే వారు.

ఆమె ముఖం చూస్తేనే తెలుస్తోంది. లోపలికి పిలవాలా, వద్దా అని తటపటాయిస్తోంది. సత్య

ఇంటాయన, గడుసుభార్యతో

"ఇదుగో, రెండు రోజులు సెలవు ఇప్పించవ్ ! అలా పుట్టింటికి వెళ్లొస్తాను."

రవిబాబు (విజయవాడ)

మూర్తికి వెనక్కి వెళ్లిపోవాలనిపించింది. కాని ఎలా వెడతాడు ? వెళ్లే మాటైతే ఎందుకు వచ్చినట్లు ?

'ఆయన గదిలో కూర్చుందురుగాని రండి.'

ఆ గదిలో కూర్చున్నాడు, ముళ్లమీద కూర్చున్నట్లుగా కాఫీ పంపించింది పిల్లచేత. 'ఇప్పుడేం తాగను వద్దు' అన్నాడు. 'పరవాలేదు తాగండి' అందామె గది అవతల నుంచుని---- తరవాత ఆ పిల్లని చూసి 'మా పెద్దమ్మాయి' అంది. ఏ మనాలో తెలియలేదు సత్యమూర్తికి 'ఒక్కర్తేనా' అన్నాడు సిగ్గుపడుతూ. 'లేదు. తర్వాత వాడు ఆడుకోవటానికి వెళ్లాడు.' అంది.

తర్వాత సంభాషణ కొంతసేపు సాగలేదు.

'ఇంకా కథలు రాస్తున్నారా' అని అడిగింది.

ఏదో జ్ఞాపకం వచ్చినట్లు చుట్టూ చూశాడు. పుస్తకాల బీరువా ఉందిగాని దాన్నిండా 'లా' పుస్తకాలు.

'అప్పుడప్పుడు' అన్నాడు.

మళ్లీ నిశ్శబ్దం. రాధ రెండో కొడుకు వచ్చినట్లున్నాడు. 'మావయ్య ఉన్నాడు ఆ గదిలో' అని చెబుతోంది ఆ మొదటి అమ్మాయి. తర్వాత వాళ్లిద్దరూ గదిలోకి వచ్చి కొంత సేపుండి వెళ్లి పోయారు.

'బిస్కట్ల పొట్లం తెచ్చినా బాగుండేది. వాళ్లకి ఇద్దును' అనుకున్నాడు.

సత్యమూర్తికి ఇంక ఉండ బుద్ధికావటం లేదు. కాని అతన్ని చూడకుండా వెడితే బాగుంటుందా ? ఎప్పుడు వస్తాడో ? ఎలా తెలుస్తుంది? ఏమని అడగాలి ?

'ఆయనెప్పుడు వస్తారు ? అనాలా' ? 'బావగారు ఎప్పుడు వస్తారు అనాలా ? కాకపోతే 'మోహనరావుగారు ఎప్పుడు వస్తారు ?' అనాలా?

అంతకంతకీ 'అనీజీనెస్' ఎక్కువయి పోతోంది. అతనికి. 'నే వస్తాను. పనుంది. చూసిపోదామని వచ్చాను' అన్నాడు.

'అదేమిటి ఆయన వచ్చేదాకా ఉండరా ?'

'ఎప్పుడొస్తారు ?'

'వచ్చే వేళయింది.'

మరో పది నిమిషాలు చూశాడు.

'నాకు పనుంది. నేను వెళ్లిపోవాలి' అని 'ఆయనతో చెప్పండి నేను వచ్చినట్లు' అన్నాడు.

ఆమె ఏమీ మాట్లాడలేదు.

గుమ్మం దాటుతుండగానే అతనేగాబోలు ఎదురు వచ్చాడు 'రాణీ' అని పిలుస్తూ. అప్పుడు గుర్తు వచ్చింది సత్యమూర్తికి ఆమె పూర్తి పేరు రాధారాణి అని. ఇప్పుడు ఆమె రాధ కాదు రాణి.

'ఈయన సత్యమూర్తిగారు. నాతో కాలేజీలో చదువుకున్నారు' అంది.

'గ్లాడ్ టు మీట్ యూ'

'సేమ్ విత్ మీ'

'లోపలికి రండి' అన్నాడు.

'లేదు పనుంది వెళ్లిపోవాలి. చాలా సేపయింది నేను వచ్చి.'

'పరవాలేదు. ఎక్కడ దిగారు ?'

'మా బంధువులింట్లో'

'నేను కబురు పంపుతాలెండి. ఈ రాత్రి ఇక్కడ ఉండిపోండి'

'కాదు. వాళ్లింట్లో పెళ్లి. ఇంకో గంటలో లగ్నం.'

'అలా అయితే ఉండ మనటం భావ్యం కాదు. రేపు రండి. ప్రొద్దున నేను కోర్టుకు వెళ్లటంలేదు.' అన్నాడు.

అని భార్యకేసి తిరిగి కాఫీ ఇచ్చావా అన్నాడు. ఆమె తల వూపింది. 'మర్చిపోకండి' అన్నాడు సత్యమూర్తి నుద్దేశించి.

'అలాగే' అని బయటపడ్డాడు సత్యమూర్తి.

స్వేచ్ఛగా వూపిరి పీల్చుకున్నాడు.

'బిడియస్తుడా' అని అతను అడగటం, 'ఉష్. గట్టిగా అనకండి. అతను వింటాడు' అని ఆమె అనటం లీలగా వినపడ్డాయి.

*　　　*　　　*

'అబ్బ ఏదో మాడు వాసన కొడుతోంది ! ఏమిటి తగల బెడుతున్నారు ?' అంటూ వచ్చింది శారద.

'ఏవో పాత కాగితాలు' అన్నాడు.

'అరే ఏదో పుస్తకం, డైరీలాగుంది. అంటి అది తియ్యబోతూ. అతడు ఆమెని వారించాడు. 'అది అలా ఉండనీ. డైరీకాదులే అది. పాత నోట్ బుక్. ఆ అట్టవేశాను అని ఇంకో అగ్గిపుల్ల వేసి అది పూర్తిగా కాలాక బూడిద తీసి బయట పారబోసి, చేతులు కడుక్కుని, 'తొందరగా తయారవు, సినిమాకి వెడదాం' అన్నాడు సత్యమూర్తి. ★